క్లుప్తంగా

ఆర్థిక సాయం

వెంకటాపురం(కె): మండలంలోని నూగూరు గ్రామానికి చెందిన ఇండ్ల రాజ్ కుమార్ సత్య వతి దంపతులు సుశాంత్ గత పది రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతూ.. భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. కాగా, జ్వరం తీవ్రత పెరగడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. దీంతో వారు నిరుపేద కుటుంబం కావడంతో సుశాంత్ వైద్య సేవల కోసం దాతలు ఇందిరా దేవి, విజయ్ సహకారంతో చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్ రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు.

కన్నాయిగూడెం: మండలంలోని ముప్పనపల్లికి చెందిన జనగం ఈశ్వర్ అనే రైతు గుండె పోటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అప్సర్ పాషా, ఇన్‌చార్జ్ జాడి రాంబాబు ఆధ్వర్యంలో కార్యకర్తలు గురువారం పరామర్శించి రూ.12వేల ఆర్థికసాయం అందజేశారు.

ఆదివాసీ చట్టాలను అమలు చేయాలి



వాజేడు: ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలు, హక్కులు పటిష్టంగా అమలు చేయాలని తెలంగాణ భూమి పుత్ర ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనెం రామచంద్ర రావు అన్నారు. గురువారం తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్‌ను రామచంద్రరావు మర్యాద పూర్వకంగా కలిసి షాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌టీఆర్, 1/59, 1/70 చట్టాలు అమలు కాక పోవడం బాధాకరమన్నారు. ఆయన వెంట మడ్డ నర్సింహులు, తాటి లక్ష్మణ్, గుర్రపు సాయి, యాలం నితిన్, యాలం కిరణ్, జాక నాగబాబు ఉన్నారు.

ఒకరిపై కేసు నమోదు

వాజేడు: ద్విచక్ర వహనాన్ని వేగంగా నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రుద్రారపు హరీష్ గురువారం తెలిపారు. మండల పరిధిలోని పాయ బాటలు గ్రామం వద్ద పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారు. అదే సమయంలో మండల పరిధిలోని చెరుకూరు గ్రామానికి చెందిన మడప ప్రవీణ్ ద్విచక్రవాహనంపై వేగంగా, అజాగ్రత్తగా వస్తుండటంతో అతడిని ఆపి పోలీస్ స్టేషన్‌కు తీసుకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. యువకులు వాహనాలను వేగంగా నడిపితే కఠిన చర్యలను తీసుకుంటామని ఎస్సై హరీష్ హెచ్చరించారు.

అధిక ధరలకు విక్రయించొద్దు



కన్నాయిగూడెం: ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు రైతులకు ఎరువులను, పురుగుల మందులను అధిక ధరలకు విక్రయించొద్దని ఏఓ ముంజు మహేష్ అన్నారు. మండలంలోని ముప్పనపల్లిలోని హారిక ఫర్టిలైజర్, పురుగు మందుల షాపును గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపులో ఉన్న స్టాక్ నమోదు రిజిస్టర్లను, బిల్లుల పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



గోవిందరావుపేట: మండల పరిధిలోని మొట్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రాజెక్ట్ నగర్ గ్రామానికి చెందిన మాడే బలరాం (45) గురువారం చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రాజెక్ట్ నగర్ గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న దురద వాగు లోకి చేపలు పట్టడానికి వెళ్లిన బలరాం చేపలు పడుతుండగా పిడుసు రావడంతో వాగులో కుప్ప కూలిపోయాడు. దీంతో ఊపిరి ఆడక చనిపోయడని తెలిపారు. ప్రాజెక్ట్ నగర్‌లో బలరాం మృతితో విషాద చాయలు అలుముకున్నాయి. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

పరామర్శ

టేకుమట్ల: మండలంలోని వెంకట్రావుపల్లికి చెందిన ఆర్ఎంపీ ఆనంద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను గురువారం ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నాయకులు పరామర్శించి ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్, నాయకులు భాస్కర్, రంజిత్, సంతోష్, రవీందర్, మల్లేష్, రవీందర్‌రావు, మబ్బూల్, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై దృష్టి



మగ్గం ట్రైనింగ్ ఇప్పిస్తున్న ట్రైనర్ సృజన జంపాల



సర్టిఫికెట్లు పొందుతున్న అభ్యర్థులు

ఉచిత శిక్షణకు మహిళల నుంచి విశేష స్పందన

● రెండు గ్రూపుల్లో 70 మందికి శిక్షణ

ఏటూరునాగారం: ఇంటికే పరిమితం అవుతున్న అతివలు స్వయం ఉపాధిపై దృష్టి సారించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో చేపట్టిన స్వయం శిక్షణకు విశేష స్పందన లభించింది. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ ట్రస్టు, ఎస్‌బీఐ, ఆర్ఎస్ఈటీ ఆధ్వర్యంలో మగ్గం ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సాయిబాబా ఆలయ ఫంక్షన్ హాల్‌లో చేపట్టారు. ఎస్‌బీఐ, ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ బాస రవి, ఫ్యాకల్టీ పరికి కిషోర్, ట్రైనర్ సృజన, రజితలు 30 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్ట్యూట్, ఎస్‌బీఐ ఆధ్వర్యంలో వస్త్ర చిత్రకల ఉదయామి పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. మగ్గం ఉచిత శిక్షణకు 70 మంది మహిళలు, యువతులు హాజరై నెల రోజుల పాటు శిక్షణ తీసుకున్నారు. స్వయం ఉపాధి శిక్షణ ట్రైనర్ సృజన, రజితలు కలిసి ఈ మగ్గం శిక్షణను నేర్పించారు. హసన్‌పర్తిలోని ఆర్ఎస్ఈటీఐలో పరీక్షలు రాసి సర్టిఫికెట్లను పొందారు. దీంతో వారు మగ్గం డిజైనర్‌గా మహిళలు ఎదిగారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయం, ఎస్‌బీఐ, ఆర్ఎస్ఈటీఐ ఆధ్వర్యంలో మగ్గం శిక్షణ ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 70 మంది మహిళలకు ఎస్సై మగ్గం స్టాండ్‌లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఇంటికే పరిమితం కావద్దన్నారు. వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసి సమాజంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఎన్ని సమస్యలు ఎదురైన ఎదుర్కొని ముందుకు సాగాలని కోరారు. అనంతరం ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎస్‌బీఐ, ఆర్ఎస్ఈటీఐ ద్వారా జూట్ బ్యాగుల తయారీ శిబిరం కూడా మరికొద్దిరోజుల్లో చేపటబోతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి అలువాల శ్రీనివాస్, జిల్లా బీసీ సెల్ నాయకురాలు రాణి, ఆలయ కోశాధికారి వెంకట్రావు, సహాయ కార్యదర్శి గంజి రమేశ్, తిరుపతి, ట్రైనర్ సృజన, రజిత పాల్గొన్నారు.



మగ్గం స్టాండ్‌లను అందజేస్తున్న ఎస్సై తాజొద్దీన్

ఉపాధి లభించింది



ఇంటిలో ఉంటూ పనులు చేసుకునేది. ఇప్పుడు మగ్గం వర్క్ నేర్చుకోవడం వల్ల షాపు పెట్టుకునే అవకాశం లభించింది. మగ్గం డిజైన్‌తో నాకు ఉన్న ప్రతిభతో ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతంది. ఈ శిక్షణ వల్ల ఎంతో నేర్చుకున్నా.

-వాణికల్యాణి, ఏటూరునాగారం

మగ్గం డిజైన్‌తో ఆర్థికాభివృద్ధి



గతంలో ఆర్‌సీఎం షాపు నడిపించాను. ఇప్పుడు ఈమగ్గం వర్క్ వల్ల ఆర్థిక అభివృద్ధికి ఆసరగా లభించింది. పెళ్లిలు, ఇతర శుభాకార్యాలకు ఈ మగ్గం వర్క్‌లు చీరెలు, జాకిట్‌లను కుట్టి విక్రయిస్తా. దీనివల్ల ఆర్థికంగా ఎదిగే అవకాశం ఈ శిక్షణ వల్ల లభించింది.

- షభాన, ఏటూరునాగారం

ఆర్థికంగా ఎదిగేందుకే శిక్షణ



మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ శిక్షణ ఇప్పించాం. శిక్షణకు సాయిబాబా ట్రస్టు ద్వారా కావాల్సిన కావాలిస్సిన ఏర్పాట్లు చేశాం. మహిళలు మగ్గం వర్క్ వల్ల ఉపాధి, ఆర్థికంగా బలపడుతారు. ఇవేకాకుండా రాబోయే రోజుల్లో మరిన్ని శిక్షణలు ఇప్పిస్తాం.

- పెండ్యాల ప్రభాకర్, సాయిబాబా దేవాలయం చైర్మన్

రోడ్లపై షాపులను తొలగించాలి



ఎంపీఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న సతీష్

ఏటూరునాగారం: మండల కేంద్రంలో రోడ్ల వెంట పండ్లు, కూరగాయల దుకాణాలను అక్రమంగా ఏర్పాటు చేసుకొని ట్రాఫిక్ సమస్యలను తీసుకువస్తున్న వ్యాపారుల షాపులను తొలగించాలని ఏటూరునాగారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడిదల సతీశ్ అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో మండల పరిషత్ అధికారి కుమార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. షాపులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

అపరిచిత నంబర్లకు స్పందించొద్దు

ఏటూరునాగారం: మహిళలు, విద్యార్థినులు, బాలికలు అపరచిత వ్యక్తుల నంబర్ల నుంచి ఫోన్ వస్తే స్పందించొద్దని, ఎలాంటి ఓటీపీలు, ఫొటోలు షేర్ చేయొద్దని ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయం ఫంక్షన్‌హాల్‌లో డయల్ 100, సైబర్ క్రైంలపై మహిళలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం కొంత మంది ఆకతాయిలు కావాలని మన నంబర్లను తీసుకొని పిచ్చి పిచ్చి మేసేజ్‌లు, వేధించడం జరుగుతుందని అలాంటి కాల్స్, మేసేజ్‌లు వస్తే వెంటనే 100కు కాల్ చేసి సమస్యను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, వెంకట్రావు, తిరుపతి, రమేష్, బీసీ సంఘం నాయకురాలు రాణి పాల్గొన్నారు.

గణపతి మండపాల వద్ద పూజలు



ఏటూరునాగారం: రామాలయంలో పూజ చేస్తున్న అర్చకుడు నాగేశ్వర్‌రావుశర్మ



బొడ్రాయి వద్ద పూజ చేస్తున్న భక్తులు

ఏటూరునాగారం: మండలంలోని గణపతి మండపాల వద్ద గురువారం 6వ రోజు అన్నదాన కార్యక్రమాలు, ప్రత్యేక పూజలను అర్చకులు బొడ్రాయి వద్ద సత్యనారాయణ, నాగేశ్వర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. ఆకుపూజ, గరక పూజలను నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాలను స్వామివారికి సమర్పించారు. దీంతో మండపాల వద్ద భక్తుల సందడి నెలకొంది.

ఘనంగా గణపతి నిమజ్జనం

వెంకటాపురం(కె): మండలంలో గణపతి నిమజ్జన కార్యాక్రమాన్ని గురువారం గణపతి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గణపతి మండపాల్లో ఐదు రోజుల పాటు పూజలు చేసిన అనంతరం ఆరవ రోజు నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శివాలయం సెంటర్, పాత మార్కెట్ సెంటర్, బీసీ మర్రిగూడెం, శివాలయం వీధిలోని గణపతి విగ్రహాలను ఊరేగింపు నిర్వహించిన అనంతరం పాత్రాపురం పంచాయతీలోని పాలెం వాగులో నిమజ్జనం చేశారు.



వెంకటాపురం(కె): ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

సీతారాం ఆశయాలను కొనసాగిస్తాం..



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గోవిందరావుపేట: సీపీఎం అభివృద్ధి కోసం సీతారాం ఏచూరి నిరంతరం కృషి చేశారని, ఆయన ఆశాయాలను కొనసాగిస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి అన్నారు. మండలంలోని పస్రా చౌరస్తలో సీపీఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి మృతికి సంతాపం తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి పని చేస్తూ ఢిల్లీలోని జేఎన్టీయూ యూనివర్సిటిలో అధ్యక్షుడిగా చేసి దేశ వ్యాప్తంగా సీపీఎం అభివృద్ధి కోసం నిరంతరం పని సీతారం పని చేశాడని తెలిపారు. మూడు పర్యాయాలు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందిన నాయకుడని పేర్కొన్నారు. పార్టీ మండల కార్యదర్శి తీగల ఆదిరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొదిలి చిట్టి బాబు, గొంది రాజేష్, గ్రామ కమిటీ సెక్రటరీ నాగరాజు, గ్రామ నాయకులు ముమ్మిడి ఉపేంద్ర చారి, ఐలయ్య, వల్లా రెడ్డి, రమేష్, రాజు, రాజేశ్వరి, బత్తిని సీత, దర్మా రెడ్డి, పురోషత్తం రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, యాదిరెడ్డితో పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి



వెంకటాపురం(కె): వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



రాజన్నపేటలో..

వెంకటాపురం(కె): కాచి చల్లార్చిన నీటినే తాగాలని వైద్యాధికారి స్నేహ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొండాపురం, నాయకులగూడెం, బోదాపురం, పాత్రాపురం, శివాపురం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం పలువురి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రజలు దోమల బారిన పడకుండా దోమ తెరలను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఆశీష్, వినయ్, సోహేల్, పవన్, వైద్య సిబ్బంది జ్యోతి, మనోహర్, యాకలక్ష్మి, రాజేష్, రాఘవులు, భూపతి, మోహన్, రాంబాబు తదితరులు ఉన్నారు.

కన్నాయిగూడెం: మండలంలోని రాజన్నపేట, వెంకట్రావుపల్లి, సర్వాయి గ్రామాల్లో స్థానిక వైద్యుడు అభినవ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గ్రామాల్లో ఫివర్ సర్వే నిర్వహించినట్లు హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్ తెలిపారు. అందులో ఐదుగురు జ్వర పీడితును గుర్తించి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు సబిత, ఊర్మిల, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం..

● మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలలంలోని నార్లాపూర్, కాల్వపల్లి గ్రామంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆదుకుంటామని మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని ఇటీవలన నార్లాపూర్‌లో పిడుగుపడి మృతి చెందిన పశువుల కాపరీ పుట్ట మహేశ్, కాలవ్వలపల్లిలో వాగు దాటే క్రమంలో ప్రమాదవశాత్తు వరదలో పడి మృతి చెందిన మల్లికార్జున్ కుటుంబాలను మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్ గురువారం పరామర్శించారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.5లక్షల విలవ గల చెక్కును మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్, కలెక్టర్ దివాకర్ టీఎస్‌లు కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బాధిత కుటుంబాలను అందుకుంటుందని మోసపూరిత మాటలు నమ్మి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, మేడారం జాతర చైర్మన్ అర్రెం లచ్చు పటేల్, మండల ఉపాధ్యక్షుడు ఇప్ప నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ బత్తిని రాజు, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న, సింగిల్ విండో డైరెక్టర్ యాశడపు మల్లయ్య, నాయకులు తండాల శ్రీనివాస్, ఎనగంటి రాములు, శ్రీనివాస్, ఇర్సవడ్ల నారాయణ, లింగాచారి, ఎనగంటి నరేష్, సమ్మయ్య పాల్గొన్నారు.



ఎస్ఎస్ తాడ్వాయి: పుట్ట మహేష్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మంత్రి సీతక్క

ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి

గోవిందరావుపేట: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని మంత్రి సీతక్కకు గోవిందరావుపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోడెం సారంగపాణి ఆధ్వర్యంలో మండల పాత్రికేయులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ.. మండలంలోని జర్నలిస్టులు 25 సంవత్సరాల పైబడి పని చేస్తూ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేత కూడా ఎలాంటి సహకారం అందక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా సీతక్క స్పందించి మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడటం జరిగిందని, అన్ని మండలాల పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా ప్రక్రియను ప్రారంభించాలని చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ మండల ఉపాధ్యక్షుడు అంకం వినయ్ కుమార్, కార్యదర్శి సామ బుచ్చిరెడ్డి, కోశాధికారి బత్తిని వెంకట్, పగడాల వాసు రెడ్డి, జన్నారపు సతీష్, రఘువీర్, వేముల సతీష్, గుండెబోయిన అనిల్ తదితరులు పాల్గొన్నారు.



గోవిందరావుటపేట: మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

పౌష్టికాహారం తీసుకోవాలి

కాటారం: గర్భిణులు, బాలింతలు స్థానికంగా లభించే పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీణ తెలిపారు. మండలంలోని విలాసాగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. పోషకాహార పదార్థాలు, రక్తహీనత నివారణ తదితర అంశాలపై గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. ఆకుకూరలు, పప్పుదినుసులు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్మిళ్లపల్లి సెక్టార్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాన్ని సూపర్‌వైజర్ సరోజన నిర్వహించారు. ఈ సందర్భంగా చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిరు ధాన్యాల వల్ల మెరుగైన ఆహారం సొంతమన్నారు. గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడంతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కావున అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పోషిని లావణ్య, విజయమ్మ, స్వరూప, అనూష ఉన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి



ఎస్ఎస్ తాడ్వాయి: సభ్యత్వం నమోదు అందజేస్తున్న నాయకులు



ఏటూరునాగారంలో..

ఎస్ఎస్‌తాడ్వాయి: బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ ద్యాగల సలేందర్ అధ్యక్షతన మండలంలోని మేడారం, కాటాపూర్ ప్రారంభించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూ ప్రజలతో సభ్యత్వం చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జంగ హన్మంత రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి లక్ష్మణ్, నాయకులు చెంగల సుభాష్, గద్దం వెంకటేశ్వర్లు, సిద్దబోయిన సురేందర్, పోరిక వెంకట్రామ్, తుపాకుల సదానందం, రంజిత్, ఈసం వెంకటేష్ పాల్గొన్నారు.

ఏటూరునాగారం: బీజేపీ సభ్యత్వాలను గ్రామాల్లో పెద్ద సంఖ్యలో నమోదు చేయాలని, పార్టీపై అనేక మంది ఆకర్షితులు అవుతున్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి, ఏటూరునాగారం ఇన్‌చార్జ్ రుద్రారపు సురేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతి పెద్దదైన రాజకీయ పార్టీ బీజేపీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి భర్తపురపు నరేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుచ్చయ్య, గండెపల్లి సత్యం, గద్దం సత్యం, కర్రె సంపత్, గద్దల ప్రణయ్, గద్దల హరిబాబు, యానాల చంద్రారెడ్డి, రమేష్, రవి, కృష్ణ పాల్గొన్నారు.

బెస్ట్ టీచర్ అవార్డు అందజేత

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం సూరారంలోని ఎస్ఎస్‌వీఎం ఇంగ్లీష్ మీడియం స్కూల్ టీచర్ కొయ్యల సాయి బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్నారు. గురువారం కాటారం కేంబ్రిడ్జి స్కూల్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో కాటారం ఎస్సై అభినవ్ ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అవార్డు అందజేశారు. ట్రస్మా కాటారం ఏరియా కమిటీ ప్రెసిడెంట్ కొట్టే శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షుడు కార్తీక్ రావు, జిల్లా ప్రధాకార్యదర్శి సంపత్ రావు ఉన్నారు.

కబ్జా చేస్తే సహించేది లేదు



భూమిని సందర్శిస్తున్న తహసీల్దార్ హేమ

చిట్యాల: మండలంలో ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే సహించేది లేదని తహసీల్దార్ హేమ అన్నారు. మండలంలోని తిర్మలాపూర్ గ్రామ రెవెన్యూ శివారులోని 206 సర్వే నంబర్‌లో గల గుట్ట సమీపంలో ఉన్న భూమిని గురువారం తహసీల్దార్ సందర్శించారు. గుట్ట సమీపంలోని భూమి కబ్జాకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అట్టి భూమిలో అక్రమంగా కొందరు సాగు చేసుకుంటున్నారని అందులో ఆయిల్ ఫామ్ మొక్కలను పెంచుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా కబ్జా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అన్నారు. ఆమె వెంట ఆర్ఐ రాజు, సర్వేయర్ రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.